క్లుప్తంగా

బుక్స్ విక్రయిస్తున్న బడులపై చర్యలు తీసుకోండి



నిజామాబాద్అర్బన్: ప్రయివేటు పాఠశాలల్లో అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం నగరంలోని కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ.. బడుల్లో అధిక రేట్లకు పుస్తకాలు అమ్ముతూ విద్యతో దందా చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు నోట్‌బుక్స్ రేటును ప్రదర్శించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనిరుధ్, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

కూలీల భరోసాకు చట్టం తేవాలి



సిరికొండ: వ్యవసాయ కూలీల భరోసా కోసం సమగ్రమైన చట్టం తేవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన సంఘ సభ్యులతో కలసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సాయారెడ్డి, కిషోర్, రమేష్, దామోదర్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఇందల్వాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ తెలిపారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీర్ఘకాలిక రోగులను గుర్తించి క్రమం తప్పకుండా మందులను పంపిణీ చేయాలన్నారు. హెచ్ఈవో శంకర్, సందీప్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, సులోచన, సురేష్, వెంకట్ రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై దాడులు చేస్తే చర్యలు

ఖలీల్‌వాడి: ప్రయివేటు విద్యాసంస్థలపై విద్యార్థి సంఘాల నాయకులు దాడులు చేసినా, యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేసినా చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యార్థులకు సమస్యలు వస్తే విద్యార్థి సంఘాలు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఆర్గనైజేషన్ పేరిట డబ్బుల వసూళ్లు, ఫీజు తగ్గింపు పేరిట ఒత్తిడి, బ్లాక్‌మెయిల్స్‌కు పాల్పడుతున్నారని పోలీసుల దృష్టికి వస్తున్నట్లు తెలిపారు. ఇలాంటివి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై సీఐలు, ఎస్సైలకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

అడ్వకేట్ క్లర్క్స్‌కు చేయూత



ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కోర్టులో మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, అడ్వకేట్స్ క్లర్క్స్ అధ్యక్షుడు రాధకిషన్ సమక్షంలో సీనియర్ న్యాయవాది మంథని రాజేందర్‌రెడ్డి అడ్వకేట్స్ క్లర్క్స్‌కు పోస్టల్ బీమాకు కావలసిన డబ్బులను అందజేశారు. ప్రధాన కార్యదర్శి ద్రుపద్, బార్ ఉపాధ్యక్షుడు రాజు, న్యాయవాదులు మానిక్ రాజు, కార్యదర్శి దొన్నల్ సురేశ్, క్లర్క్స్ అసోసియేషన్ సభ్యులు రమేష్, నగేష్, రాము,శివరాజ్, గంగాధర్, రాజు పాల్గొన్నారు.

నేడు పాఠశాలల బంద్

తెయూ(డిచ్‌పల్లి): ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ విమర్శించారు. ఈక్రమంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 26న ఇచ్చిన పాఠశాలల బంద్‌కు అన్ని పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

గృహజ్యోతికి దరఖాస్తుల వెల్లువ

- నగరంలో ఇప్పటికే 80వేల మందికి జీరో బిల్లు
- తాజాగా అర్హుల నుంచి మళ్లీ దరఖాస్తుల స్వీకరణ



జోన్-3 పెద్దబజార్ కార్యాలయ పరిధిలో దరఖాస్తు చేసుకుంటున్న వినియోగదారులు

నిజామాబాద్‌నాగారం : నగర మున్సిపాలిటీలో ప్రారంభించిన గృహజ్యోతి పథకం దరఖాస్తుల ప్రత్యేక కౌంటర్లకు దరఖాస్తుదారులు భారీగా పోటెత్తారు. మొదటి రోజు వందల సంఖ్యలో దరఖాస్తుల వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ఇప్పటికే నగరంలో పక్కాగా అమలు చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం 80వేల మంది వినియోగదారులకు జీరో బిల్లు వస్తుంది.

మరింత మంది అర్హులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తుల స్వీకరణకు తాత్కాలికంగా బ్రేక్ పడిన విషయం తెలిసిందే. మళ్లీ మంగళవారం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా జీరో బిల్లు కోసం వినియోగదారులు దరఖాస్తు చేసుకోవడానికి ఎగబడుతున్నారు. కొత్తగా మరో 20వేలమంది దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రత్యేక కౌంటర్లు ఇలా..

నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. నగర పరిధిలో విద్యుత్‌పరంగా మూడు ఏడీఈ సెక్షన్ కార్యాలయాలు, 9 ఏఈ సెక్షన్ కార్యాలయాలున్నాయి. వీటిలో పాటు రూరల్ ఏఈ కార్యలయం, మాక్లూర్ మండలం, మోపాల్ మండలంలోని కొన్ని వీలిన గ్రామాలు ఇందులోకి వస్తాయి. ఇందుకోసం మున్సిపల్‌కమిషనర్ మకరందు ప్రత్యేకంగా మున్సిపల్ కార్యాలయంతో పాటు, ఆరు జోన్ కార్యాలయాల్లో దరఖాస్తులు తీసుకోవడానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. నగరంలోని జోన్-1(నాందేవాడ), జోన్-2(గోల్‌హనుమాన్), జోన్-3(పెద్దబజార్), జోన్-4ఎ(రాజీవ్‌గాంధీఆడిటోరియం), జోన్-4బి(కంఠేశ్వర్), జోన్-5(అర్సపల్లి)లల్లో సైతం సిబ్బంది ఏర్పాటు చేసి గృహజ్యోతితో పాటు, రూ.500సిలిండర్ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే తెల్ల రేషన్‌కార్డు ఉండి కూడా 200యూనిట్ల లోపు బిల్లు వచ్చేవారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలి. మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా సరే అర్హత ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చు. మొదటి రోజు 800మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైనవారు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజాపాలన దరఖాస్తులు, తెల్లరేషన్‌కార్డు, మీటర్ నంబర్ తీసుకొని వెళితే, వివరాలను కంప్యూటర్ యాడ్ చేస్తే జీరో బిల్లు వస్తదని అధికారులు పేర్కొంటున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి..

తెల్లరేషన్‌కార్డు ఉండి 200యూనిట్లలోపు విద్యుత్ ఖర్చు చేసే వినియోగదారులు అందరూ మున్సిపాలిటీ పరిధిలో ఉండే జోన్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కంప్యూటర్‌లో అప్‌డేట్ చేస్తే జీరో బిల్లు వస్తుంది. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. – రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

నేటి చిత్రం..



నగరంలోని పాత కలెక్టరేట్ సమీపంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

అధ్వానంగా డ్రెయినేజీ

నగరంలోని పాత కలెక్టరేట్ – రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఈ దారిలోని టిఫిన్ సెంటర్ పక్కన మురికినీరు నిలిచిపోయి, పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను బాగుపరిచి, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పదెకరాల్లోపు భూమి ఉన్నవారికే రైతు భరోసా ఇవ్వాలి



రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

డిచ్‌పల్లి: సాగు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేసే రైతు భరోసా పథకాన్ని 10ఎకరాల లోపు రైతులకు మాత్రమే అందజేయాలని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు భరోసా విధి విధానాలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. పంట పండని బీడు భూములు, వెంచర్లు, రోడ్లు, శిఖం భూములు, ఇల్లు, రెవెన్యూ శాఖ అధికారులతో సమగ్రంగా సర్వే నిర్వహించి వాటిని ధరణి నుంచి తొలగించాలన్నారు. సాగు భూములకు మాత్రమే రైతు భరోసా అందించాలన్నారు. అర్హులైన రైతుల వివరాలు బ్యాంకుల ద్వారా సేకరించి వారికి రైతు భరోసా ఇవ్వాలని విన్నవించారు. ఏడీఏ తిరుమల ప్రసాద్, రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయాధికారులు రాంబాబు, రవీందర్, హీరా, దేవిక, ఏఈవోలు, సొసైటీ చైర్మన్లు చింత శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, రాంచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నిజామాబాద్ రూరల్: గత పాలకుల తప్పుడు విధానాలు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా మూతపడిన సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి, ప్రభుత్వమే నడిపించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు మచర్ల నాగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని జాలాల్‌పూర్ గ్రామంలో మంగళవారం వారు రైతులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలతో జిల్లాలోని రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీలు తెరిపిస్తామని అందులో భాగంగా సబ్ కమిటీ వేశారని, ఆ సబ్ కమిటీలో ఏఐకేఎంఎస్ లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సబ్ కమిటీలో ఏఐకేఎంఎస్‌ను చేర్చి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాములు, అశోక్, రాజ్‌కుమార్, సాయినాథ్, అష్మాబేగం, గంగామణి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్అర్బన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘనాయకులు మంగళవారం విద్యాశాఖ అధికారులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలని, ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా ఇంటర్ అధికారికి వినతిపత్రం అందించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని, ప్రయివేటు కార్పొరేట్ పాఠశాల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి కర్క గణేష్, ఉపాధ్యక్షుడు అనిల్ డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మనోజు, నిఖిల్, రవీందర్, హనుమాండ్లు, దుర్గాప్రసాద్, తేజ, అషూర్, చందు, నిఖిల్, మహిపాల్, మమత, జంపన్న పాల్గొన్నారు.



క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి



సింగంపల్లి జీపీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

మోపాల్: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో క్లోరినేషన్‌పై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సింగంపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. క్లోరినేషన్, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వానాకాలంలో సీజనల్ వ్యాధుల దృష్ట్యా తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ ఎప్పటికప్పుడు చేయాలని తెలిపారు. పారిశుధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్తం

నేడు డీవీకే స్మారక స్తూపం ప్రారంభం


ఖలీల్‌వాడి: నగరంలోని డీవీకే నగర్‌లో నేడు విప్లవోద్యమ నాయకుడు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీకే స్మారక స్తూపావిష్కరణ, వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కేజీ రాంచందర్, రమ, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఫోన్ అప్పగింత



ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన కాసుల సాయిలు కొన్నిరోజుల క్రితం ఫోను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఫోన్‌ను కనిపెట్టి మంగళవారం బాధితుడికి అందజేశారు. ఎస్సై విక్రమ్ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్న, చోరీకి గురైన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలోని భువనగిరి స్వప్న అనారోగ్యానికి గురికావడంతో నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. మంగళవారం బాధితురాలికి వైద్యచికిత్స కోసం శ్రీలక్ష్మీ చేయూత సేవా సమితి సభ్యులు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అధ్యక్షులు వంగల రమణాచారి, లక్ష్మన్, సి.హెచ్.రవీందర్, రవీంద్రచారి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యదర్శికి సన్మానం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీపాద రామేశ్వర్ ఇటీవల హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయనను మంగళవారం మెప్మా అధికారులు, సిబ్బంది సత్కరించారు. టౌన్‌ప్రాజెక్టు అధికారి రమేష్, డీఎంసీ మాధూరి, టీఎంసీ శోభారాణి, టీఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శిలు మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన పీడీకి..



సిరికొండ: మండలంలోని తూంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పీడీగా పదోన్నతి పొందిన నాగేష్‌ను గ్రామానికి చెందిన హెల్పింగ్ హర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అలాగే బదిలీల్లో భాగంగా పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. శ్రీకాంత్, రాజు, రవి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన బీఆర్‌టీయూ నేతలు



నిజామాబాద్‌నాగారం: నగరంలో ఇటీవల మున్సిపల్ కార్మికురాలు కోల లలిత ప్రమాదవశాత్తు మృతిచెందింది. దీంతో మున్సిపల్ కమిషనర్ రూ.2లక్షల విరాళాలు సేకరించి, బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా బీఆర్‌టీయు ప్రెసిడెంట్ రమేష్ మంగళవారం కమిషనర్ మందమకరందును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

ఏఐఎస్‌బీ వార్షికోత్సవం

బోధన్: ఏఐఎస్‌బీ (ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) 74వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకు ని పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు నాగరాజు మంగళవారం ఆవిష్కరించారు. నాయకులు రాజన్న, గంగాప్రసాద్, శ్రీను, అన్వేష్, లక్ష్మణ్, మహేశ్ పాల్గొన్నారు.

సమాచారం..

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ నెల 28 నుంచి టైలరింగ్ (30 రోజులు), జూలై 1 నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్(30 రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతా యన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు (19 నుంచి 45 సంవత్సరాలు) శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆర్ఎస్ఈటీఐలో దరఖాస్తు చేసుకోవాలని ఆ యన సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. శిక్ష ణ అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్ అందజేస్తామని, వివరాలకు 08461-295428ను సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం..

మోపాల్: మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారు ఉపాధిహామీ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లింగం ఒక ప్రకటనలో తెలిపారు. వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయని, కావున అన్ని గ్రామాల్లోని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హులైన వారికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

మోడల్ టాయిలెట్లకు స్థలం పరిశీలన..

మండలంలోని మోపాల్, కులాస్‌పూర్ గ్రామాల్లో మోడల్ టాయిలెట్ల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ లింగం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ టాయిలెట్లను మండలానికి ఒక గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జనసంచారం అధికంగా ఉన్న గ్రామంలో వీటి ఏర్పాటుకు అనుమతులిచ్చిందని పేర్కొన్నారు. మోపాల్, కులాస్‌పూర్ గ్రామంలో ఎక్కడైనా ఒక చోట మోడల్ టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు చేపడుతామని తెలిపారు.

ఆధ్యాత్మికం..

గణేష్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు





నిజామాబాద్అర్బన్: నగరంలోని గణపతి ఆలయాల్లో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గల శుభం కరోతి గణపతి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గాయత్రినగర్‌లోని సిద్ధి వినాయక్ స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, గరిక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బొడ్డెమ్మ చెరువు వద్ద గల మహా గణపతి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, గరిక పూజ సింధూరం సమర్పరణ చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ఆలయ చైర్మన్ చిలుము భూషన్ చారి, మచ్చ చంటయ్య, అర్చకులు రాజుశర్మ, సభ్యులు భూపాల్, మురళి, దాస్, ప్రవీణ్ ఉన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,700	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	67,062	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	75	గాజరుగడ్డ	35	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	80	100	గోబిగడ్డ	25	50
కాకరకాయ	60	90	గోబిపువ్వు	25	50
వంకాయ	25	50	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	50	75
పుదీనా	50	80	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మహారాజ(తెలుగు)- 1.45, 4.40, 7.35, 10.3
స్క్రీన్-2	ఓమైగాడ్(తెలుగు) - 11.10,4.35 ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు)-1.40 నింద (తెలుగు) - 7.30, 10.25
స్క్రీన్-3	మనమే (తెలుగు)- 1.35, 4.40, 10.30 సందేశం (తెలుగు) - 7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మహారాజ(తెలుగు)-11.05, 4.30, 7.35, 10.40-మరణం(తెలుగు)-2.10
స్క్రీన్-2	ఇన్‌సైడ్ అవుట్-2(3డీ ఇంగ్లీష్)-11.30 5.05, ఏ (తెలుగు)-1.50 జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ (హిందీ)- 7.25 ముంజ్యా(హిందీ)- 10.35
స్క్రీన్-3	ఓ మైగాడ్(తెలుగు) - 11.15, 7.55 హనీమూన్ ఎక్స్‌ప్రెస్ (తెలుగు) - 2.00 హరోంహర (తెలుగు) - 4.40 చందు చాంపియన్ (హిందీ) - 10.40
స్క్రీన్ -4	ఇట్లు మీ సినిమా (తెలుగు) - 11.45 నింద(తెలుగు)-2.20,7.50 ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు)-5.00 మనమే(తెలుగు)-10.30
దేవి	మహారాజా (తెలుగు)
నటరాజ్	చందు చాంపియన్ (హిందీ)
విజయ్	నింద (తెలుగు)

ఇంటి వద్దే పింఛన్ అందించాలి



వేల్పూర్: వృద్ధులు, వికలాంగులు, బెడ్‌రెస్ట్‌లో ఉన్న వారికి ఇంటి వద్దే ఆసరా పింఛన్‌ను అందించాలని ఎంపీటీసీ మొండి మహేశ్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో వృద్ధులు, వికలాంగుల తరఫున కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పోస్టాఫీస్ వద్ద పింఛన్ తీసుకోవడానికి వచ్చేవారికి కనీస సౌకర్యాలు లేవన్నారు. బెడ్‌రెస్ట్‌లో ఉన్న వృద్ధులు నడవలేక పింఛన్ తీసుకోడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పింఛన్‌దారుల ఇబ్బందులను గుర్తించి నడవలేనివారికి ఇంటి వద్దే పింఛన్ అందించాలని కోరారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

రెంజల్: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. దండిగుట్ట, రెంజల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి స్థానిక గ్రామ సంఘాల సభ్యులకు, కార్యదర్శులకు సూచనలు అందించారు. మొదటి విడత లో మంజూరైన పనులను త్వరిత గతిన పూర్తి చేయించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.